# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **టిటిడి ఆధ్వర్యంలోని అన్ని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**

2. **రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.**

3. **రాష్ట్ర వ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.**

4. **అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమల తిరుపతిలో ఈరోజు పర్యటిస్తున్నారు. ఆయన ఈ ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని రంగ నాయకుల మండపంలో శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం, పరాభవ నామ సంవత్సర పంచాంగం, డైరీ, క్యాలెండర్లను తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్.నాయుడు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి ముద్దాడ రవిచంద్ర ముఖ్యమంత్రికి అందించారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో 44 లక్షల రూపాయలను ఒకరోజు అన్నదాన విరాళాన్ని ముఖ్యమంత్రి అందజేసి, స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఆ తరువాత తిరుమలలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించి, టీటీడీ వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్‌తో పాటు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్మించిన భారత ఆహార భద్రత, ప్రమాణాల అథారిటీ-ఎఫ్ఎస్ఎస్ఎఐ స్టేట్ ఫుడ్ ల్యాబ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. భక్తులు అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు.

--------------------------

రైతుల కష్టమే నేడు దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు మూలస్తంభంగా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సింగుపురం గ్రామంలో జరిగిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం శాసన సభ్యులు గోండు

శంకర్‌తో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సాగునీరు, కాలువలు, నీటి పంపిణీ వ్యవస్థలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయం సమృద్ధిగా ఉందని.. అదే ఈ ప్రాంతానికి శక్తిగా నిలుస్తోందని కేంద్రమంత్రి తెలియజేస్తూ..

వాయిస్...27 సెకన్లు

----------------------------

ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమని ముస్లిం మత పెద్దలు తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ముస్లిం ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు ఈరోజు నిర్వహించారు. ఈ ప్రార్థనలో వేలాది మంది ముస్లింలు పాల్గొని ఒకరికొకరు ఆలింగం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ.. 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేసి అల్లా అనుగ్రహం పొందుతారని తెలిపారు. ప్రతి ఏడాది హిందూ, ముస్లిం సోదరులు కలిసి ఇక్కడ రంజాన్ పర్వదినాన్ని జరుపుకొని మతసామరస్యాన్ని చాటుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు.

మరో వైపు శ్రీకాకుళం , తిరుపతి, అనంతపురం, పశ్చిమగోదావరి జిల్లాల్లో కూడా రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

----------------------------

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి చెంచుపేటలోని ఈద్గాలో జరిగిన రంజాన్ వేడుకల్లో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు కోరిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై రాబోయే రోజుల్లో చర్చించి పనులు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

----------------------------

అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. భవిష్యత్తు తరాల వారికి అడవుల ప్రాముఖ్యాన్ని తెలపాలనే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) మార్చి 21వ తేదీన 'వరల్డ్ ఫారెస్ట్ డే'గా నిర్వహించాలని భావించింది. 1971లో జరిగిన ఎఫ్ఏఓ 16వ సర్వసభ్య సమావేశంలో అన్ని దేశాలూ దీన్ని ఆమోదించాయి. ఆ తర్వాత 2012, నవంబరు 28న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ మార్చి 21వ తేదీన అంతర్జాతీయ అటవీ దినోత్సవంగా జరుపుకోవాలని అధికారికంగా తీర్మానించింది. అడవుల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయడం, వాటి నిర్వహణ, పరిరక్షణ, అభివృద్ధిని ప్రోత్సహించడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.

----------------------------

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారంగా నిలుస్తూ జిడిపిలో సుమారు 30 శాతం, ఎగుమతుల్లో 45 శాతం వాటాను అందిస్తున్నాయని గుంటూరు పోస్టల్ సూపరింటెండెంట్

యలమందయ్య తెలిపారు. వీటిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇండియా పోస్ట్ 'డాక్ నిర్యత్ కేంద్రాలు' ఏర్పాటు చేసి ప్రత్యేక సేవలు అందిస్తోందన్నారు. ఈ కేంద్రాల ద్వారా చేతివృత్తిదారులు, చిరు వ్యాపారులు తమ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని గుంటూరు పోస్టల్ సూపరింటెండెంట్ యలమందయ్య ఆకాశవాణికి తెలియజేస్తూ..

వాయిస్.. 25 సెకన్లు

---

పోలవరం జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ఐదుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటన నిన్న చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు కాలేజీల్లో ఇంజినీరింగ్ చదువుతున్న ఏడుగురు విద్యార్థులు గురువారం ఉదయం విజయవాడ నుంచి తెలంగాణలోని భద్రాచలం వెళ్లి దైవదర్శనం చేసుకుని నిన్న ఉదయం ఎటపాక గోదావరి నదిలో స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో ఓ విద్యార్థి మునిగిపోతుండగా అతన్ని కాపాడేందుకు ఒకరిని ఒకరు చేయి అందించుకుని మునిగిపోయారు. నిన్న సాయంత్రానికి ముగ్గురి మృతదేహాలను బయటకు తీయగా, ఈరోజు మరో ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు.

---

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

---

నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు నిన్న వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజు చండీశ్వరపూజ, పూర్ణాహుతి, త్రిశూల స్నానం వంటి కార్యక్రమాలు జరిగాయి. రాత్రి ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలో శ్రీ భ్రమరాంబికా దేవి అక్కమహాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించారు.

====================